దళారులను నమ్మి మోసపోవద్దు

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభంలో ఎమ్మెల్యే బుయ్యాని



పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల, అక్టోబర్ 29: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధి అగ్గనూరులోని మారుతీ కాటన్ మిల్ వద్ద సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన పారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతాంగాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకొంటుందన్నారు. రైతులు తాము పండించిన పత్తిని సీసీఐ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే విక్రయించి తగిన మద్దతు ధరను పొందాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు. కొనుగొలు దారులు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తమ దృష్టికి వస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పూర్తి నాణ్యతా ప్రమాణాలను కలిగి ఉన్న పత్తికి క్వింటాలుకు రూ. 7521 చెల్లిస్తామన్నారు. తేమ 9% ఉంటే రూ.7445.79, 10% ఉంటే రూ. 7370.58, 11% ఉంటే రూ.7295.37, 12% ఉంటే రూ.7220.16 చెల్లించనున్నట్లు వివరించారు. రైతులు పత్తి బాగా ఆరబెట్టి తగిన తేమ శాతం ఉందని నిర్ధారించుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సురేంధర్‌రెడ్డి , సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మోటర్‌సైకిళ్ల దొంగ అరెస్టు

- నాలుగు వాహనాలు రికవరీ

పరిగి, అక్టోబర్ 29 : మోటర్‌సైకిళ్లను దొంగతనం చేసి జైలు జీవితం గడిపిన వ్యక్తి బయటకు వచ్చిన తర్వాత మళ్లీ మోటర్ సైకిళ్ల దొంగతనానికి పాల్పడిన దొంగను పరిగి పోలీసులు అరెస్టు చేశారు. పరిగి ఎస్ఐ సంతోష్‌కుమార్ అందించిన వివరాల ప్రకారం మంగళవారం ఉదయం పరిగి పట్టణంలోని కొడంగల్ క్రాస్‌రోడ్డులో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా బొంరాస్‌పేట నుంచి ఒక ఫ్యాషన్ మోటర్‌సైకిల్‌పై వస్తున్న వ్యక్తి అనుమానాస్పదంగా కని పించగా అతడిని ఆపి సదరు వాహనానికి సంబంధించిన పత్రాలు చూపించాల్సిందిగా పోలీ సులు అడిగారు. దీంతో అతడు పారిపోవడానికి ప్రయత్నించడంతో పోలీసులు పట్టుకొని ఉన్నతాధికారులకు అప్పగించారు. ఈ మేరకు విచారించగా బొంరాస్‌పేట మండలం ఏర్పుమల్ల గ్రామానికి చెందిన నట్టలి హనుమంతుగా గుర్తించారు. విచారణలో తాను మోటర్‌సైకిళ్ల దొంగతనానికి పాల్పడినట్లు అంగీకరించారు. 2022 నుంచి పరిగి, తాండూరు ప్రాంతాల్లో మోటర్‌సైకిళ్లు, ఆటోలు దొంగతనం చేసిన కేసులలో ఇదివరకే జైలుశిక్ష అనుభవించి బయటకు వచ్చిన తర్వాత మళ్లీ వాహనాల దొంగతనాలకు పాల్పడ్డాడు. ఈ మేరకు పరిగిలో మూడు మోటర్‌సైకిళ్లు, ఒక స్కూటీని దొంగిలించినట్లు అంగీకరించారు. పరిగిలోని నవదుర్గా వైన్స్ ముందు నిలిపి ఉన్న ఏదుల గోవర్ధన్‌కు చెందిన మోటర్‌సైకిల్ ఈనెల 28వ తేదీన, మణికంఠ వస్త్రాలయం ముందు నిలిపివున్న వర్కల అశోక్‌కు చెందిన మోటర్‌సైకిల్‌ను ఈనెల 26వ తేదీన, అలాగే గంజ్‌రోడ్డులో సెప్టెంబర్ 13వ తేదీన చింతల్‌పల్లికి చెందిన కుమ్మరి విఠలయ్య మోటర్‌సైకిల్, వాసవి డ్రెసెస్ దగ్గర అనంతప్రసాద్‌కు చెందిన స్కూటీని దొంగిలించాడని గుర్తించారు. ఈ మేరకు వాహనాలు రికవరీ చేయడంతోపాటు హనుమంతును అరెస్టు చేశామని, రిమాండ్‌కు పంపించనున్నట్లు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

ఉచిత మెగా వైద్యశిబిరం..



పెద్దేముల్, అక్టోబర్ 29: మండల పరిధిలోని ఇందూరు గ్రామంలో మంగళవారం ఎల్ఎన్ఆర్ యువసేన ఆధ్వర్యంలో వికారాబాద్ శ్రీ మహావీర్ హాస్పిటల్స్ సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని హన్మాపూర్ మాజీ సర్పంచ్ లొంక నర్సింహులు ప్రారంభించారు.వైద్య శిబిరంలో 180 మందికి పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఇందూరు ప్రకాశ్, నరేందర్, వెంకట్, చంద్ర శేఖర్, కుర్వ బాలు, లొంక రాములు, మహేశ్,ప్రవీణ్, సురేశ్, మహావీర్ హాస్పిటల్ డాక్టర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్ట వ్యతిరేకం

బాల్య వివాహాలను వ్యతిరేకిస్తూ విద్యార్థులతో ప్రమాణం చేయిస్తున్న ఎస్సై సురేశ్

మర్పల్లి, అక్టోబర్ 29: బాల్య వివాహాలు చేస్తే చర్యలు తప్పవని ఎస్సై సురేశ్ అన్నారు. మంగళవారం మండలంలోని సిరిపురం గ్రామంలో సాధన సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివా హాలను వ్యతిరేకిస్తూ గ్రామంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అమ్మాయిలకు 18 ఏండ్లు, అబ్బాయిలకు 21 ఏండ్లు నిండ కుండా వివాహాలు చేస్తే వచ్చే సమస్యల గురించి వివరించారు. ఎక్కడైనా బాల్యవివా హాలు చేసినట్లు తెలిస్తే 1098 లేదా 100 కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీవో ప్రవీణ, సాధన సంస్థ సభ్యుడు యాదయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రిజ్వానా, పంచాయతీ కార్యదర్శి మహేశ్ గౌడ్, మాజీ సర్పంచ్ మల్లయ్య, అలీమొద్దిన్, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసు వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన

నవాబుపేట,అక్టోబర్29: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నవాబుపేట ఎస్ఐ అరుణ్‌కుమార్ మంగళవారం పలు విషయాలపై అవగాహన కల్పించారు. పోలీసుస్టేషన్ ఆవరణలో నిర్వహించిన ఈ కార్య క్రమంలో ఫ్రెండ్లీ పోలీసింగ్, చట్టాల అమలు, పోలీసుల విధులపై, కేసులకు సం బంధించిన విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మల్లేషం, టీచర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఒకేసారి 31 సీసీ కెమెరాల ఏర్పాటు

అభినందనీయం

పెద్దేముల్, అక్టోబర్ 29: జిల్లాలో నాగులపల్లి ఆదర్శ గ్రామంగా పరిగణించబడుతున్నదని జిల్లా ఎస్పీ కె.నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నాగులపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన 31 సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 70 మంది ఆర్థిక సాయంతో గ్రామస్తులందరూ కలిసికట్టుగా ముందుకు వచ్చి రూ. 3,14, 500లతో 15 రోజుల్లో 31 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. జిల్లాలో తాను పదవీ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఇంత పెద్ద మొత్తంలో 31 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడం, అందుకు తనను ముఖ్యఅతిథిగా ఆహ్వానించినందుకు గ్రామస్తులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. గ్రామంలో ఓ లైబ్రరీ ఏర్పాటు చేయాలని సూచించారు. తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ 31 సీసీటీవీ కెమెరాల ఏర్పాటుతో గ్రామంలో ప్రస్తుతం 31 మంది పోలీసులు విధులు నిర్వహిస్తున్నట్లేనన్నారు. సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ సాధ్యమన్నారు. కార్యక్రమంలో తాం డూరు రూరల్ సీఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఐలు కె.గిరెన్న, గఫార్, హెడ్‌కా నిస్టేబుల్ రమేశ్, గ్రామపెద్దలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్పీ నారాయణ రెడ్డి

డీఎంహెచ్‌వో బదిలీ

వికారాబాద్, అక్టోబర్ 29 : వికారాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిగా పని చేసిన డాక్టర్ పాల్వన్‌కుమార్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిగా వెంకటరమణను ఉన్నతాధికారులు నియమించారు. ఇక్కడ పని చేసిన డీఎంహెచ్‌వో పాల్వన్‌కుమార్ సిద్దిపేట జిల్లాకు బదిలీపై వెళ్లారు.

దుద్యాల తహసీల్దార్‌గా కిషన్

కొడంగల్, అక్టోబర్ 29: దుద్యాల మండల నూతన తహసీల్దార్‌గా కిషన్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ వెంకటేశ్ ప్రసాద్ బదిలీపై వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన తసీల్దార్‌ను సిబ్బంది సన్మానించి పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రవికిషోర్, సిబ్బంది ఫకీరప్ప, లాలప్ప, నరేశ్, చంద్రయ్య వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దేముల్ మండల తహసీల్దార్‌గా వెంకటేశ్ ప్రసాద్

పెద్దేముల్, అక్టోబర్ 29: మండల తహసీల్దార్ కె.కిషన్ బదిలీ అయ్యారు.ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం పెద్దేముల్ తహసీల్దార్ కిషన్ దుద్యాల మండలానికి బదిలీ కాగా ఆయన స్థానంలో దుద్యాల మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న బి. వెంకటేశ్ ప్రసాద్ పెద్దేముల్ మండల తహసీల్దార్‌గా నియామకమయ్యారు.

ఎన్కేపల్లికి బస్సు సౌకర్యం..

కొడంగల్, అక్టోబర్ 29 : బొంరాస్‌పేట మండలంలోని ఎన్కెపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు అందుబాటులోకి వచ్చింది. మంగళవారం గ్రామస్తులు ఆర్టీసీ బస్సుకు పూజలు చేసి ప్రారంభించారు. ఉదయం సాయంత్రం రెండు పూటలు బస్సు గ్రామానికి రానుందని ఆర్టీసీ సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

కులకచర్ల, అక్టోబర్ 29 : తమపై దాడి చేసిన వ్యక్తిని ఉద్యోగం నుంచి తొలగించాలని అంతారం గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రమౌళి జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమ ర్పించారు. తమ కుటుంబంపై దాడి చేసి తీవ్రగాయాలు చేసిన అంతారం గ్రామానికి చెందిన ఉద్యోగినిని ఉద్యోగం నుంచి తొలగించాలన్నారు. ఒక ఉన్నతమైన ఉద్యోగంలో ఉంటూ తమపై విచక్షణారహితంగా దాడి చేసి గాయపర్చారని అన్నారు. ఈ విషయంపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు

ఎస్‌బీఐ మేనేజర్‌పై ఖాతాదారుల ఫిర్యాదు

కులకచర్ల, అక్టోబర్ 29: ఖాతాదారులను ఇబ్బంది పెడుతున్న కులకచర్ల స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ వినోద్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, బ్లాక్2 అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్, మాజీ ఎంపీపీ అంజిలయ్యగౌడ్ లీడ్ బ్యాంక్ మేనేజర్ యాదగిరికి ఫిర్యాదు చేశారు. వివిధ పనుల నిమిత్తం బ్యాంకుకు వచ్చే ఖాతాదారులపై దురుసుగా వ్యవహరిస్తున్నారన్నారు. బ్యాంకు స్టేట్ మెంట్లు కావాలంటే నెలల పాటు తిరగాల్సిన పరిస్థితి ఉందని ఇదేమిటని అడిగితే అడిగిన వారిపై బెది రింపులకు పాల్పడుతున్నాడన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుప్పలి వెంకటేశ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు జలీల్, ఎన్ ఆంజనేయులు, పి కృష్ణ, వెంకట్, మహిళా సంఘం నాయకులు, రైతులు, బ్యాంకు ఖాతాదారులు పాల్గొన్నారు.

వికారాబాద్, అక్టోబర్ 29 : వికారాబాద్ పట్టణంలోని కొంపల్లి సమీపంలో ఉన్న వృద్ధ ఆశ్రమాన్ని మంగళవారం జిల్లా న్యాయసేవాధికారాసంస్థ సెక్రెటరీ, న్యాయమూర్తి డీబీ షీతల్ సందర్శించారు. అక్కడ ఉన్న వృద్ధులతో మాట్లాడి వారి బాగోగుల గురించి అడిగి తెలుసుకున్నారు . ఈ వృద్ధాశ్రమ నిర్వాహకుడికి వారిని జాగ్రత్తగా చూసుకోవాలని ఆదేశించారు. జిల్లా న్యాయసేవాడికారసంస్థ సెక్రటరీతో పాటు చీఫ్ లీగల్‌ఏడ్ న్యాయవాది వెంకటేశ్, డిప్యూటీ లీగల్‌ఏడ్ న్యాయవాది రాము తదితరులు ఉన్నారు.

'ఓంశాంతి ఓం' ఆధ్వర్యంలో దీపావళి వేడుకలు

వికారాబాద్, అక్టోబర్ 29 : దీపావళి పండుగను పురస్కరించుకొని మంగళవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఓం శాంతి ఓం భవనంలో వేడుకలు నిర్వహించారు.వేడుకల్లో వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ పాల్గొన్నారు. దీపావళి పండుగ విశిష్టతను వివరించారు. దీపావళి పండుగ మన జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఓం శాంతి ఓం ప్రతినిధులు మధుఅక్కయ్య, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్ గోపాల్, వికారాబాద్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు వెంకటయ్య, దేవదాసు తదితరులు ఉన్నారు.

డిగ్రీ కాలేజీకి సొంత భవనం నిర్మించాలి

వికారాబాద్, అక్టోబర్ 29 : వికారాబాద్ జిల్లా కేంద్రంలో డిగ్రీ కళాశాల పక్కా భవనం ఏర్పాటు చేయాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీవో కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హరీశ్‌రావు మాట్లాడుతూ విద్యా కేంద్రంగా ఉన్న వికారాబాద్ జిల్లా కేంద్రంలో డిగ్రీ కళాశాల భవనం లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న వికారాబాద్ జిల్లా కేంద్రంలో డిగ్రీ కళాశాల పక్కా భవనం వెంటనే నిర్మించాలన్నారు. పక్కా భవనం లేక విద్యార్థులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పక్కా భవనం నిర్మించే వరకు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి మహేశ్, కె శివప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

బంట్వారం/కోట్‌పల్లి,అక్టోబర్ 29: స్థానిక కస్తూర్బా గురుకుల పాఠశాల విద్యార్థులకు కోట్ పల్లి పోలీస్‌స్టేషన్‌లో చట్టాల అమలు, పోలీసుల విధులపై ఎస్ఐ స్రవంతి అవగాహన కల్పించారు. సమాజంలో ప్రతి వ్యక్తి ఎలా మసులుకోవాలి, అందుకు మన చట్టాలు ఎలా ఉన్నాయి, మనం చట్ట పరిధిలో చేయాల్సిన పనులు ఏమిటి అని తెలిపారు. పోలీస్ స్టేషన్ ఎవరి కోసం ఉంది, నేర విభాగాలు, ఆయుధాలు తదితర వాటిపై విద్యార్థులకు వివరించారు

తప్ప చేస్తే చర్యలు తప్పవు

సామాజిక తనిఖీలో వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

దోమ, అక్టోబర్ 29: ఉపాధిహామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఏపీడీ సరళ, జిల్లా విజిలెన్స్ అధికారి భార్గవి హెచ్చరించారు. దోమ మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ పథకంలో ఏప్రిల్ 2023 మార్చి 2024 వరకు మండల పరిధిలోని 36 గ్రామ పంచాయతీల్లో జరిగిన 15వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదికను మంగళవారం ఏర్పాటు చేసి విచారణ జరిపారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధిహామీ పనుల్లో అవకతవకలకు పాల్పడిన వ్యక్తులపై రికవరీతో పాటుగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. బుద్లాపూర్ గ్రామంలో మొక్కల పెంపకంలో పంచాయతీ కార్యదర్శి, టెక్నికల్ అసిస్టెంట్లు అవకతవకలకు పాల్పడి నట్లు తనిఖీ బృందం తేల్చింది. కొండాయపల్లి గ్రామానికి చెందిన మేట్ నర్సింహులు 48 రోజుల బిల్లులు వారి కుటుంబ సభ్యుల పేర్లపై తీసుకున్నట్లు తనిఖీ బృందం వారు తెలిపారు. ఈ తతంగం మొత్తం పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ ఆధ్వర్యంలో కొనసాగినట్లు వారు పేర్కొన్నారు. దాదాపూర్ గ్రామంలో ఫార్మేషన్ రోడ్డు విషయంలో అధిక బిల్లులు సంబంధిత అధికారులు కాజేసినట్లు తనిఖీ బృందం సభ్యులు సామాజిక తనిఖీ సభలో తెలిపారు. వీటితో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో అవకతవకలకు పాల్పడ్డ వ్యక్తులతో పాటు సంబంధిత అధికారులపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని అధికారులు అన్నారు. కార్యక్రమంలో అంబుడ్స్‌మెన్ రాములు, తహసీ ల్దార్ పురుషోత్తం, ఎంపీడీవోలు మహేశ్‌బాబు, జయరాం, ఏపీవో దస్త య్య, ఎస్ఆర్పీ గంగారం, ఏవో ప్రభాకర్‌రావు, సూపరింటెండెంట్ నరేందర్, ఈసీ చంద్రశేఖర్, డీఆర్పీలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఆయా శాఖల అధికారులు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

అర్హులందరికీ 'కల్యాణలక్ష్మి'

కులకచర్ల, అక్టోబర్ 29: అర్హులైన ప్రతి ఒక్కరికీ కల్యాణలక్ష్మి పథకాన్ని వర్తింపజేస్తామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం చౌడాపూర్ మండల కేంద్రంలో చౌడాపూర్ మండలానికి చెందిన 47మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు కల్యాణలక్ష్మి చాలా ఉపయోగ పడుతుందని తెలిపారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించేందుకు కార్య కర్తలు కృషిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రభులు, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్పటి అశోక్‌కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, కులకచర్ల మండల అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు, నాయకులు శివరాంనాయక్, సలీమ్, శేఖర్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అమృత్ 2.0లో భాగంగా మాస్టర్ ప్లాన్ సర్వే

మారనున్న తాండూరు రూపురేఖలు

తాండూరు, అక్టోబర్29: అమృత్ 2.0లో భాగంగా మాస్టర్ ప్లాన్ అమలుకు ఎంపికైన తాండూరు మున్సిపల్ అభివృద్ధే లక్ష్యంగా డీటీసీపీ, సర్వే ఆఫ్ ఇండియా నిర్వహిస్తున్న సర్వే తాండూరు పట్టణంలో ప్రారంభమైంది. మంగళవారం డ్రోన్ ద్వారా ఈ సర్వే నిర్వహించారు. ఈ సర్వే వారం రోజుల పాటు కొనసాగనుంది. తాండూరు అభివృద్ధి కొత్త పుంతలు తొక్కనుంది. పట్టణ సరిహద్దులను ఈ ప్రత్యేక బృందం పరిశీలించింది.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ

వికారాబాద్, అక్టోబర్ 29 : పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ డిమాండ్ చేశారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని క్లబ్‌హాల్‌లో ఆధ్వర్యంలో ఉద్యోగ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేయాలన్నారు. భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వానికి అత్యధికంగా భారంగా మారనున్న కంట్రిబ్యూటరీ పెన్షన్స్ స్కీం విధానం పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇటీవల కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించారని, మన రాష్ట్రంలో కూడా పునరుద్ధరించాలని కోరారు. విస్తృత స్థాయి సమావేశంలో భాగంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మహబూబ్ నగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్, రాష్ట్ర సెల్ కన్వీనర్ వెంకటేశ్, రాష్ట్ర సాహిత్య సభ్యులు మురహరి, అన్ని మండలాల ఉద్యోగులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల

ధారూరు,అక్టోబరు 29: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అందరూ బీఎల్వోలు వారి పోలింగ్ స్టేషన్‌లలో ఓటర్ ముసాయిదా జాబితాను ప్రదర్శించాలని ధారూరు తహసీల్దార్ సాజిదా బేగం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండల పరిధిలోని బీఎల్వో సూపర్ వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ధారూరు మండలంలో మొత్తం 47 పోలింగ్ స్టేషన్లు, స్త్రీలు 18122, పురుషులు 17587 మొత్తం 35,709 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ విజయేందర్, గిర్దావర్లు స్వప్న, నవీన, జూనియర్ అసిస్టెంట్ రామకృష్ణ, బిఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

General public are hereby informed that my client M/S Shriram Finance Ltd, Armoor Branch, Dist. Nizamabad agreed to accord Loan to **Borrower: Sriram Premsagar** S/o Sriram Srinivas, Age 26 Yrs, Occ:Business, R/o H.No.3-3-609, Sai Priya Nagar, Gayatri Nagar, Nizamabad on mortgage of the schedule referred property. The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within **7 days** of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property. Hence this notice

SCHEDULE OF THE PROPERTY

All that the open plot No.249 in A-Block, admeasuring 146.66 Sq.Yds in the layout known as "True Gold-8-A" vide T.L.P. No.29/2019/H, situated in Sy Nos. 206/P, 207 & 213 of Madhurapur Village, Farooq nagar Mandal, Rangareddy District, T.S., under the jurisdiction of Regn. Sub.Dist Farooq Nagar)

Bounded as below : North: Plot No. A-250, **South:** Plot No.A-248, **East:** Plot No.A-242 **West:** 33'wide Road

Sd/- R.JAGADISHWER RAO, Advocate
Subhash Nagar, Nizamabad, Cell:9848094409